క్లుప్తంగా

కొండలమ్మకు మొక్కుబడులు



గుడ్లవల్లేరు: కొండలమ్మ అమ్మవారిని ఆదివారం భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. అమ్మవారికి మొక్కుబడులు చెల్లించారు. మహిళా భక్తులు పాల పొంగళ్లను సమర్పించారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులు తీర్థ ప్రసాదాల్ని స్వీకరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఈఓ సురేష్ తగు ఏర్పాట్లు చేశారు.

అల్లినగరంలో మాజీ ఎమ్మెల్యే పూజలు

మండవల్లి: మండలంలోని అల్లినగరం గ్రామంలో ఉన్న గంగా పార్వతీ సమేత విశ్వేశ్వర స్వామి దేవస్థానంలో మాజీ ఎమ్మెల్యే జయమంగళ వెంకటరమణ ఆదివారం పూజలు నిర్వహించారు. శివరాత్రిని పురస్కరించుకుని వైఎస్సార్ సీపీ నాయకులు పరింకాయల వెంకటేశ్వరరావు, సర్పంచ్ జంపన వీర బాబు ఆధ్వర్యంలో భారీ అన్న సమారాధన నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. ఎంపీటీసీ సభ్యుడు కె.నాయన బాబు, వైఎస్సార్ సీపీ నాయకులు చేబోయిన వీర్రాజు, యశోధనరావు, గుడివాడ తమ్మిస్వామి, బొమ్మనబోయిన గోకర్ణ, మెండా సురేష్ పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం



గుడివాడటౌన్: ది గుడివాడ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం బైపాస్ రోడ్‌లోని మమత వృద్ధాశ్రమంలో అన్నదానం చేశారు. క్లబ్ అధ్యక్షుడు నారాయణరెడ్డి సతీమణి సున్నైనారెడ్డి వితరణతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. క్లబ్ కోశాధికారి లక్ష్మణరెడ్డి, సంయుక్త కార్యదర్శి శివ, సభ్యులు కుటుంబరావు, మెట్రో శ్రీను, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

176 మందికి వైద్య పరీక్షలు

గుడ్లవల్లేరు: లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు ఆధ్వర్యాన స్థానిక లయన్స్ సేవాభవన్‌లో ఆదివారం ఉచిత మధుమేహ వైద్య శిబిరం నిర్వహించారు. రోగులకు గుడివాడకు చెందిన వైద్యురాలు గవిర్నేని రజిని వైద్య పరీక్షలు చేశారు. డాక్టర్ నర్రా గంగాధరరావు(వెస్టీండీస్) ఆర్థిక సాయంతో నిర్వహించిన ఈ శిబిరంలో 176 మందికి పరీక్షలు చేశామని లయన్స్ అధ్యక్షుడు శింగంశెట్టి ఆదినారాయణ తెలిపారు. 15 రోజులకు సరిపడా మందుల్ని రోగులకు ఉచితంగా పంపిణీ చేశారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు.

నిత్యాన్నదానానికి రూ. 1.53 లక్షలు విరాళం



మోపిదేవి: వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయంలో నిర్వహించే నిత్యాన్నదానానికి మచిలీపట్నానికి చెందిన భక్తులు కొల్లిపర నాగ వెంకట శ్రీకాంత్, లక్ష్మీ సుస్మిత దంపతులు రూ. 1.53 లక్షలు విరాళంగా అందజేశారు. ఈ మొత్తానికి సంబంధించిన చెక్కును ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణకు అందించారు. దాతలను ఆలయ మర్యాదలతో సత్కరించారు. ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నాగాయలంక(అవనిగడ్డ): నాగాయలంక మండల పరిధిలోని జింకపాలెంలో రామాలయం నిర్మాణానికి శ్రీ రామా వెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ తోట శ్యాంకిశోర్ నాయుడు రూ.10 వేలు విరాళం అందజేశారు. ఆదివారం రామాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో శ్యాంకిశోర్ నాయుడు ఈ మొత్తాన్ని ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులకు అందజేశారు.

అపరాలకు మద్దతు ధర.. రైతుల్లో ఆనందం

- నియోజకవర్గంలో 92 వేల ఎకరాల్లో సాగు
- ఆశాజనకంగా మినుము, పెసర
- దిగుబడులు సైతం బాగా ఉంటాయని భావిస్తున్న రైతులు
- కొన్నిచోట్ల మినుము తీత పనులు



కళకళలాడుతున్న మినుము పంట

పామర్రు: అపరాలకు ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించడంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలో రెండో పంటగా వేసిన అపరాలు ఆశాజనకంగా ఉన్నట్లు రైతులు చెబుతున్నారు. పంట ఏపుగా పెరిగి దిగుబడులు బాగా వచ్చేలా ఉన్నాయని అంటున్నారు. పంట కాలంతో పాటు పెట్టుబడులు సైతం తక్కువగా ఉండటంతో రైతులకు అపరాల సాగు అనుకూలంగా ఉంది. 60 రోజుల్లోనే పంట చేతికొస్తుంది. డిసెంబర్ చివరి వారంలో అపరాలు వేశారు. ఈ నెలాఖరుకు పంట తీత మొదలవుతుంది. ఇప్పటికే కొన్ని చోట్ల మినుము తీతలు కొనసాగుతున్నాయి. కాలువల ద్వారా వచ్చే నీటితో సాగు చేస్తున్నారు.

నియోజకవర్గంలో సాగు ఇలా....

ప్రస్తుతం నియోజకవర్గంలోని పామర్రు, మొవ్వ, తోట్లవల్లూరు, పమిడిముక్కల, పెదపారుపూడి మండలాల్లో 92 వేల ఎకరాల్లో రైతులు అపరాల సాగు చేపట్టారు. 90 వేల ఎకరాల్లో మినుము, 2 వేల ఎకరాల్లో పెసర సాగు జరిగింది. ఈ ఏడాది ప్రకృతి సహకరించడం, ప్రభుత్వం సైతం పంటలకు మద్దతు ధర ప్రకటించడంతో రైతులు సంతోషంగా ఉన్నారు. మినుము క్వింటాల్‌కు రూ.7,500, పెసరకు 8,500 ధర ప్రభుత్వం ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో వాతావరణం అనుకూలించకపోవడం వల్ల పూత, పిందె దశలో నీరందక దిగుబడులు తగ్గిపోయాయి. దీంతో పాటు ధరలు లేక రైతులు తీవ్రంగా నష్టపోయారు. ప్రస్తుతం ఆ పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుల సంక్షేమానికి విశేషంగా కృషి చేస్తున్నారు.

పైర్లకు పుష్కలంగా నీరు...

అపరాలకు ఇప్పటి వరకు చెప్పుకోదగ్గ విధంగా తెగుళ్లు, పురుగులు సోకలేదు. పైర్లు ఆశాజనకంగా ఉండటంతో ముందు జాగ్రత్త చర్యగా రైతులు రసాయన మందులను పిచికారీ చేస్తున్నారు. పూత, పిందె దశలో నీరందక ప్రతి ఏటా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ ఏడాది ప్రభుత్వం పంట కాల్వలకు పూర్తి స్థాయిలో నీరు విడుదల చేస్తున్నందున పైర్లకు తడి అందించే అవకాశం ఏర్పడింది. దీనివల్ల దిగుబడులు గణనీయంగా పెరుగుతాయనే అశాభావాన్ని రైతులు వ్యక్తం చేస్తున్నారు.

సాగు ఖర్చు తక్కువ



వరి సాగుతో పోలిస్తే అపరాల సాగుకు ఖర్చులు తక్కువగా ఉంటాయి. ఇప్పటి వరకు పైరు బాగా ఉన్నందున ఎకరానికి 5 నుంచి 6 కింటాళ్ల దిగుబడి రావచ్చునని భావిస్తున్నాం.

-కె.రామదాసు, రైతు

లాభదాయకం



అపరాలకు ప్రభుత్వం సరైన మద్దతు ధర ప్రకటించినందున రైతులకు లాభదాయకంగా ఉంటుంది. దిగుబడులు సైతం మెరుగ్గానే ఉన్నాయి. ప్రధానంగా పంటల విక్రయానికి దళారుల ప్రభావం తగ్గిపోయింది.

యు.సత్యనారాయణ, రైతు

ప్రకృతి విధానం మేలు



మినుము పైరుపై చీడపీడలు, పురుగు నివారణకు అధికంగా పురుగు మందులు వాడకూడదు. తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడులు సాధించే ప్రకృతి వ్యవసాయ విధానంతో పంటలకు మేలు చేకూరుతుంది.

బి.శివనాగమణి , ఏవో పామర్రు

అంతర్గత రహదారులకు నిధులు మంజూరు

- ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్
- లంకపల్లిలో గడప గడపకు మన ప్రభుత్వం



లంకపల్లిలో వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్

పమిడిముక్కల: అంతర్గత రహదారుల అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ చెప్పారు. మండలంలోని లంకపల్లి గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఎమ్మెల్యే అనిల్ కుమార్ ఇంటింటికీ వెళ్లి ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని వివరిస్తూ ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో నెలకొన్న రహదారుల సమస్యను ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. వెంటనే స్పందించిన ఆయన గ్రామంలో రహదారులు బాగు చేసేందుకు రూ.20 లక్షల నిధులు మంజూరు చేస్తామని చెప్పారు.

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గడప గడపలో ఆయా గ్రామాల్లో గుర్తించే సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా నిధులు మంజూరు చేస్తున్నారని పేర్కొన్నారు. అలానే గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తామని చెప్పారు. రైతుభరోసా నగదు పడలేదని ఇద్దరు రైతులు ఎమ్మెల్యే కైలేకు తెలిపారు. అధికారులతో ఆయన మాట్లాడి రికార్డులు చెక్ చేయించగా ఆ రైతులకు నగదు జమ అయినట్లు గుర్తించారు. బ్యాంకుకు వెళ్లి ఆధార్‌కార్డులు సమర్పించి నగదు తీసుకోవాలని రైతులకు సూచించారు. అలానే రేషన్ కార్డులో పేర్లు విభజన చేయాలని ఓ వ్యక్తి కోరగా వెంటనే పరిష్కరించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు.

ప్రజాశీర్వాదమే జగనన్నకు శ్రీరామరక్ష

ప్రజల ఆశీర్వాదమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి శ్రీరామరక్ష అని తెలిపారు. సమస్యలను లిఖితపూర్వకంగా నమోదు చేసుకుని నిర్దేశిత గడువులోగా పరిష్కారం చూపాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా పథకాలు అందిస్తున్న ఘనత సీఎం జగన్‌దేనన్నారు. సంక్షేమ ప్రభుత్వానికి ప్రజలు వెన్నుదన్నుగా నిలవటాన్ని జీర్ణించుకోలేక ప్రతిపక్షాలు అనవసర రాద్ధాంతం సృష్టించి దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్నాయని మండిపడ్డారు. ప్రతిపక్షాలు అన్నీ కలిసి మూకుమ్మడిగా దాడిచేసినా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాబలం ముందు చిత్తుకావటం ఖాయమన్నారు. కార్యక్రమానికి ముందుగా ఏఎంసీ వైస్ చైర్మన్ కొడాలి రాంబాబు ఆధ్వర్యంలో గ్రామంలో ఘన స్వాగతం లభించింది. డప్పు వాయిద్యాలు, పూలతో ఎమ్మెల్యేతో పాటు నాయకులకు స్వాగతం పలికి కార్యక్రమాన్ని ముందుకు నడిపారు. సర్పంచ్ వేమూరి రత్నకుమారి, ఎంపీటీసీ మీర్జా సజాద్ అలీ, వైస్ ఎంపీపీలు కొడమంచిలి మహేష్, గంజాల సీతారామయ్య, ఏఎంసీ వైస్ చైర్మన్ కొడాలి రాంబాబు, మండల కన్వీనర్ యలమంచిలి గణేష్, రెడ్డిక కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కంభపు రాంబాబు, మండల ప్రధాన కార్యదర్శి మారపాక మహేశ్వరరావు, మాజీ ఎంపీపీ శొంఠి వెంకటేశ్వరరావు, పాతూరి చంద్రపాల్, లంకపల్లి నేతలు కనుమూరి వెంకటేశ్వరరావు, గంద్రపు స్వరూపరావు, ముళ్లపూడి సోమయ్య, వేమూరి రమేష్ పాల్గొన్నారు.

కామెడీ షోగా లోకేష్ పాదయాత్ర



మాట్లాడుతున్న ఎంపీ నందిగం సురేష్

పమిడిముక్కల(పామర్రు): లోకేష్ పాదయాత్ర పేరడీని తలపించే కామెడీ షోగా మారిందని బాపట్ల ఎంపీ నందిగం సురేష్ ఎద్దేవా చేశారు. మండలంలోని లంకపల్లి ఎట్టివానిగూడెంలో ఏర్పాటుచేసిన బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహావిష్కరణ సభలో ఆదివారం ఎంపీ నందిగం సురేష్ మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలు, తన బంధువులుగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భావిస్తారని పేర్కొన్నారు. ఆయా వర్గాలకు రాజ్యాంగ ఫలాలను అందిస్తున్నారన్నారు. చంద్రబాబు ఆ కులాలను చిన్న చూపు చూస్తూ హేళన చేస్తారని విమర్శించారు. మాజీ ఎంపీపీ శొంఠి వెంకటేశ్వరరావు, మారపాక మహేష్ అధ్యక్షతన నిర్వహించిన సభలో ఏఎంసీ వైస్ చైర్మన్ కొడాలి రాంబాబు, సర్పంచ్ వేమూరి రత్నకుమారి, ఎంపీటీసీ మీర్జా సజాద్ అలీ, నాయకులు కళ్లం వెంకటేశ్వరరెడ్డి, కనుమూరి వెంకటేశ్వరరావు, యలమంచిలి గణేష్, తదితరులు పాల్గొన్నారు.

27 నుంచి గంగానమ్మ తల్లి జాతర మహోత్సవాలు



ఆలయంలోని గంగానమ్మతల్లి అమ్మవారు

పామర్రు: ఈ నెల 27 నుంచి మార్చి 5 వ తేదీ వరకూ గంగానమ్మ తల్లి జాతర మహోత్సవాలు నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం సభ్యులు విలేకర్లతో మాట్లాడుతూ జాతర సందర్భంగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. మహోత్సవానికి రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలివస్తారని తెలిపారు. అమ్మవారి ఘటం కుండను, పోతురాజు గడలకు గ్రామోత్సవం మేళతాళాలు, కనకతప్పెట్లతో వైభవంగా ఊరేగింపు నిర్వహిస్తామని పేర్కొన్నారు. తొలిరోజు తెల్లవారు జామున గంగానమ్మతల్లిని ఆమె పుట్టినిల్లు అయిన బొమ్మారెడ్డి మధుసూదన రెడ్డి (మునసబుగారి) ఇంటి వద్దకు తీసుకెళతారు. అక్కడ అమ్మవారికి విశేషంగా పూజలు నిర్వహిస్తారు. అనంతరం అక్కడి నుంచి పసుపు, కుంకుమ, నూతన వస్త్రాలను తీసుకొస్తారు. ఆలయంలో గంగానమ్మకు జాతర తొలిరోజున 108 మంత్ర జలాలతో అభిషేకం నిర్వహించి పుట్టింటి నుంచి తెచ్చిన వస్త్రాలను సమర్పించి, పసుపు కుంకుమలతో విశేషంగా అలంకరిస్తారు. అనంతరం అదే రోజు ఆలయం నుంచి గ్రామోత్సవానికి గంగానమ్మ బయలు దేరుతుందన్నారు. తొలిరోజే గ్రామంలోని నాలుగు పొలి మేరల్లో కట్టు నిర్వహించి దుష్ట శక్తులు ప్రవేశించకుండా కట్టడి చేస్తారన్నారు. ఆ తర్వాత గ్రామంలో మేళ తాళాలు, డప్పు వాయిద్యాలతో, చిన్నా పెద్ద అందరూ కలిసి ఉల్లాసంగా.. ఉత్సాహంగా ఊరేగింపు చేపడతామన్నారు. ప్రతి రోజూ గ్రామోత్సవం అయిన తర్వాత అమ్మవారిని ఆలయంలో ఉంచుతారు. చివరి రోజైన మార్చి 5వ తేదీన అమ్మవారు ఆలయ ప్రవేశం జరిగిన తర్వాత భక్తులు తమ మొక్కుబడులు తీర్చుకుంటారు. గ్రామస్తులతో పాటు హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, విజయవాడ తదితర ప్రాంతాల్లో స్థిరపడిన స్థానిక ప్రజలు వేలాదిగా తరలివస్తారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఏవిధమైన అసౌకర్యం కలుగకుండా తగు విధమైన చర్యలు తీసుకున్నట్లు కమిటీ సభ్యులు బొమ్మారెడ్డి వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు.

కనులపండువగా స్వామి కల్యాణోత్సవం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు పాల్గొన్న భక్తులు

గుడివాడటౌన్: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని అన్ని శివాలయాల్లో శనివారం రాత్రి స్వామి వారి కల్యాణం కనులపండువగా నిర్వహించారు. వేలాది మంది భక్తులు కల్యాణంలో పాల్గొని జాగారం చేశారు. శనివారం రాత్రి 12 గంటల తదుపరి స్వామి వారి అభిషేకాలు ప్రారంభించి ఆదివారం వేకువజామున 5 గంటల వరకు నిర్వహించారు.. స్థానిక బంటుమిల్లి రోడ్‌లోని భీమేశ్వరస్వామి వారి దేవస్థానంలో ఆలయ ఈఓ నటరాజన్ షణ్ముగం దంపతులు కల్యాణంలో పాల్గొని పూజలు చేశారు.

ఘనంగా శివ పార్వతుల గ్రామోత్సవం



గ్రామంలో ఘనంగా ఊరుగుతున్న ఆది దంపతులు

పామర్రు: మహాశివరాత్రి సందర్భంగా స్థానిక సోమేశ్వరస్వామి ఆలయంలో శనివారం రాత్రి శివ పార్వతుల కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. అనంతరం ఆదివారం ఉదయం ఆది దంపతులైన కల్యాణ మూర్తులను గ్రామోత్సవం చేశారు. పురవీధుల వెంబడి గంగా పార్వతీ సమేత సోమేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాలను మేళ తాళాలతో భక్తుల నామస్మరణల మధ్య గ్రామోత్సవం చేశామని ఆలయ మేనేజర్ కందుల వెంకటరెడ్డి తెలిపారు. తొలుత ఆలయంలో ఉత్సవ మూర్తులకు విశేషంగా పూజలు చేశామని పేర్కొన్నారు. సిబ్బంది కూసం ప్రభాకరరెడ్డి, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

పుట్లచెరువులో తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి

గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే డీఎన్నార్



గ్రామంలో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే డీఎన్నార్

మండవల్లి: మండలంలోని పుట్లచెరువు గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.49 లక్షల నిధులు మంజూరు చేశామని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) తెలిపారు. పుట్లచెరువులో ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సర్పంచ్ గురుగుబెల్లి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఎమ్మెల్యే డీఎన్నార్ ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వివరించడంతో పాటు బ్రోచర్లు పంపిణీ చేశారు. ఏడాదిగా తాగునీటి సమస్యతో అవస్థలు పడుతున్నామని పలువురు గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. సమస్య పరిష్కరించాలని విన్నవించారు. ఎమ్మెల్యే డీఎన్నార్ మాట్లాడుతూ ఇప్పటికే నిధులు మంజూరయ్యాయని, త్వరలోనే పనులు చేపడతామని వెల్లడించారు. నూతన పైపులైన్ల ఏర్పాటు, రక్షిత నీటి ట్యాంక్ నిర్మాణం చేస్తామని చెప్పారు. అలానే పలువురు పింఛన్లు మంజూరు చేయాలని కోరగా దరఖాస్తులు పరిశీలించి అర్హత ఉన్న వారికి కొత్తగా పింఛను అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ప్రతి గడపకూ సంక్షేమం....

గ్రామ సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ ఏర్పాటు ద్వారా ప్రతి గడపకు సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. జగనన్నకు ప్రజలంతా అండగా ఉండాలని కోరారు. ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గా ప్రసాద్ (రాము), వైస్ ఎంపీపీ ఆగస్తి ఆదివిష్ణు, జెడ్పీటీసీ సభ్యురాలు ముంగర విజయనిర్మల, పార్టీ మండల అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి చేబోయిన వీర్రాజు, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు బేతపూడి యేసోబురాజు, పీఏసీఎస్ అధ్యక్షుడు బొమ్మనబోయిన గోకర్ణయాదవ్, సర్పంచులు కాగిత సూర్యనారాయణ, బుర్ల బోగేశ్వరరావు, నాగదాసి థామస్, మాజీ ఎంపీపీ ముంగర గోపాలకృష్ణ, మాజీ సర్పంచ్ బలే నాగరాజు, ఎం.సురేష్, మాజీ ఎంపీటీసీ కూనా శ్రీనివాసరావు, కార్యదర్శి రాధిక తదితరులున్నారు.

జగనన్నకు అండగా ఉండాలి



జయమంగళను అభినందిస్తున్న మట్టగుంట ప్రజలు

కైకలూరు: పేదల సంక్షేమానికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నాయకులు జయమంగళ వెంకటరమణ తెలిపారు. టీడీపీ నుంచి ఇటీవల సీఎం సమక్షంలో పార్టీలో చేరిన జయమంగళను నియోజకవర్గంలోని పలు గ్రామాల ప్రజలు ఆటపాకలో ఆయన నివాసంలో కలసి అభినందించారు. జయమంగళ మాట్లాడుతూ టీడీపీ కోసం అహర్నిశలు పని చేసినా మోసం చేశారని ధ్వజమెత్తారు. కొల్లేరులో పలు సమస్యలపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సానుకూలంగా స్పందించారన్నారు. ప్రజలకు సేవ చేసే వ్యక్తులను ప్రజలు ఎప్పటికీ మరువరన్నారు. సీఎం ప్రేమగా తనను పార్టీలోకి ఆహ్వానించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు సయ్యపురాజు గుర్రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

మండవల్లి: పిన్నమనేని కోటేశ్వరరావు ఎడ్యుకేషన్ అండ్ మెడికల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పిల్లలకు ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. విజవాడ రెయిన్‌బో ఆస్పత్రి డాక్టర్లు దోమల శ్రీకాంత్, బి.రాజు, కొర్రపాటి ప్రసూన్, గుడివాడ ఉమా పిల్లల ఆస్పత్రి వైద్యులు పిన్నమనేని రామకృష్ణప్రసాద్ పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు, మాజీ జెడ్పీటీసీ బొమ్మనబోయిన విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

25న మండల సర్వసభ్య సమావేశం

మొవ్వ: ఈ నెల 25న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జి.సుధా ప్రవీణ్ తెలిపారు. ఎంపీపీ కొండేటి ఇందిర అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని కోరారు. ఆయా శాఖల పురోగతిపై సమీక్షిస్తామన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కైకలూరు: విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని గుడివాడ విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ టి.రామకృష్ణ ఆదివారం విలేకరులకు చెప్పారు. నియోజకవర్గంలో ముదినేపల్లి మండలం చిగురుకోట 132/33 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేస్తున్నామన్నారు. దీని వల్ల నియోజకవర్గంలో కలిదిండి, పోతుమర్రు, కోరుకొల్లు, మూలలంక, వరహాపట్నం, పల్లెవాడ, చిగురుకోట విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయ ఉంటుందన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

సందడిగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



సమావేశమైన పూర్వ విద్యార్థులు

కైకలూరు(కలిదిండి): పూర్వ విద్యార్థుల కలయికతో అరుతెగళపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆదివారం సందడిగా మారింది. పాఠశాలలో 1991-92 ఏడాది పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు 40 మంది సమావేశమయ్యారు. అలనాటి మధురస్మృతులను నెమరువేసుకున్నారు. ఒకరినొకరు యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. చదువులు చెప్పిన గురువులు శేషగిరిరావు, రామారావు, ప్రభావతి, నరసింహారావు, స్థానిక హెచ్‌ఎం బీవీ వెంకట్రావులను పూర్వ విద్యార్థులు సన్మానించారు. పూర్వ విద్యార్థి ఇప్పుడు ఎంఈఓగా పని చేస్తున్న బి.శ్రీనివాసరావు, రాచపట్నం, వరహాపట్నం సర్పంచులు అల్లూరి మంగారావు, ఉప్పలపాటి నాగమణి, కాళ్లపాలెం ఉపసర్పంచ్ పి.రాజు, కోటి, శ్రీను, రమేష్, సుజాత, శివ సురేష్, నాగ వీర కుమార్, నీలిమ, పద్మారాణి పాల్గొన్నారు.